క్లుప్తంగా

విద్యా రంగానికి నిధులు కేటాయించాలి



వర్ని/బోధన్‌టౌన్ : బడ్జెట్లో విద్యారంగానికి 15% నిధులు కేటాయించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వర్నిలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ప్రవీణ్, బోధన్‌లో ఏబీవీపీ నగర కార్యదర్శి కునాల్ మీడియా సమావేశంలో మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యకర్తలు సంజయ్, ఓంకార్, హన్మంతు, వంశీ, విష్ణు, మహేష్, వినోద్‌లు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్



బోధన్‌రూరల్/ఎడపల్లి : సాలూర, బోధన్, ఎడపల్లి మండలాల్లోని గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లను బోధన్ రూరల్, ఎడపల్లి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సర్పంచుల జాయింట్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తమ పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

16న ఆర్మూర్‌లో సోషల్ మీడియా సంగమం

ఆర్మూర్: సమాజాన్ని చైతన్యం చేయడంలో భాగంగా పట్టణంలోని శ్రీచంద్ర టెక్నో స్కూల్‌లో ఈ నెల 16న సోషల్ మీడియా సంగమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. సమాచార భారతి ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమాజంలో మంచిని పంచడం కోసం పని చేస్తూ జాతీయ భావజాలం గలిగిన సోషల్ మీడియా కార్యకర్తలకు ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ఈసమావేశానికి వక్తలుగా ప్రముఖ సామాజిక విశ్లేషకులు మదన్ గుప్తా, ఆర్గనైజర్ ఆంగ్ల వార పత్రిక దక్షిణ భారత దేశ బ్యూరో చీఫ్ సురేందర్ హాజరువుతున్నారన్నారు.

విధి నిర్వహణలో గుర్తింపు పొందాలి



నవీపేట : ప్రభుత్వ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో మంచి గుర్తింపు పొందాలని డీఈవో అశోక్ సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి పదవీవిరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎంఈవో అశోక్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, మండల నాయకులు భూమయ్య, శివకుమార్, రవి, తెలంగాణ గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం జిల్లా నాయకులు సురేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మిర్దాపల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 23,480 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాలలో ఉచితం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేశ్ విద్యార్థులకు వైద్యా పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సురేందర్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాకోరాలో ..

వర్ని : మండలంలోని జాకోరా గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ రక్త పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎం జ్యోతి, వైఆర్‌జీకె లింక్ వర్కర్ సూపర్ వైజర్ రజిత, డీపీఎం సుధాకర్ పర్యవేక్షణలో లింక్ వర్కర్ గౌస్ అహ్మద్ పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థులకు ఉచిత దంతవైద్య..

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు డాక్టర్ శీను నాయక్ దంత పరీక్షలు నిర్వహించారు.

వాతావరణ మార్పులతో ఇబ్బందులు

- ఉదయం ఎండ, రాత్రి చలి
- పెరుగుతున్న వైరల్ ఫీవర్లు



వైరల్‌ఫీవర్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ఎండలతో బోసిపోతున్న అంబేద్కర్ చౌరస్తా

ఆర్మూర్‌టౌన్: గత కొన్ని రోజులుగా వాతావరణ మార్పులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం పూట తీవ్రమైన ఎండ, రాత్రి కాగానే చలివేస్తుంది. ఈవాతావరణ మార్పులతో చిన్నారులు, వృద్ధులు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లకు గురవుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులు క్యూ కడుతున్నారు. ఇది వేసవికాలంలో జరిగే సహజమైన మార్పని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో ప్రతిరోజు సుమారు 300పైన ఓపీ వస్తుంది. ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఉదయం 11నుంచి 4గంటల వరకు ఎవరు బయటకు వెళ్లొద్దు.
- బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు సమయానికి మందులు వేసుకోవాలి.
- దగ్గు, దమ్ము, ఉన్నవాళ్లు ఎండకు వెళ్లొద్దు.
- ఉదయం, సాయంత్రం కొద్దీ సమయం వ్యాయామం చేయాలి.
- రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలి.
- గర్భిణులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి.

తరచూ నీరు తాగాలి



ఎండ నుంచి కాపాడుకునేందుకు ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. శరీరం డీహైడ్రెట్ కాకుండా తరచూ నీరు తాగుతూ ఉండాలి. ఎండ వేడి తగ్గిన తరువాత బయటకు వెళ్లి తమ పనులు చేసుకోవాలి.

– రవికుమార్, సూపరింటెండెంట్, ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి

మొండి బకాయిదారులపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: ఆస్తిపన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కచ్చితంగా 100% ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు. ఆస్తిపన్నులు చెల్లించని వారిపై నల్లకనెక్షన్, కరెంట్ కనెక్షన్లు తొలగించడంతో పాటు, ఆస్తులు సీజ్ చేయడం ద్వారా పన్ను వసూలు సాధించాలని అధికారులకు సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావాలంటే మున్సిపాలిటీకి మరో రూ.1.15 కోట్లు వసూలు చేయాలని అధికారులు గుర్తు చేశారు. ఈసమావేశంలో ఆర్‌వో ఉమాదేవి, ఆర్‌ఐ దత్తరెడ్డి పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులు తప్పడంలేదు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సంధ్యారాణి

రెంజల్(బోధన్): పాలకుల నిర్లక్ష్యంతోనే మహిళలపై ఆఘాయిత్యాలు పెరుగుతున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కే. సంధ్యారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా వివక్ష, వేధింపులు తప్పడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోషల్ మీడియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. స్త్రీలు తమ హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా నాయకుడు నరేందర్, గంగామణి, అమూల్య, మల్లవ్వ, రాజమణి, పోసాని తదితరులు ఉన్నారు.

బోధన్‌లో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సును నిర్వహించారు, ఈ సదస్సుకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్ హాజరై మాట్లాడారు. మహిళలపై పలు చోట్ల దాడులు జరుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ సదస్సులో జిల్లా ఉపాధ్యాక్షులు రమేష్ బాబు, విక్టోరియా రాణి, లావణ్య, పద్మా, సునీత, గంగామణిలు పాల్గొన్నారు.

ఆర్మూర్ మహిళ సమాఖ్యకు ఉత్తమ పురస్కారం



అవార్డు అందుకుంటున్న స్పందన, ఏపీఎం గంగారాం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల మహిళ సమాఖ్య జిల్లా స్థాయిలో ప్రథమ పురస్కారాన్ని అందుకుంది. జిల్లా కేంద్రంలో మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీనిధి పథకంలో ప్రతిభ కనబర్చిన ఆర్మూర్ మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు స్పందన, ఏపీఎం గంగారాంకు అడిషనల్ డీఆర్డీవో రవీందర్ ప్రథమ పురస్కారాన్ని అందజేశారు. ఆర్మూర్ మండల మహిళ సమాఖ్యకు జిల్లా స్థాయిలో ప్రథమ పురస్కారం రావడం వరుసగా ఇది ఏడోసారి. కార్యక్రమంలో మహిళ సంఘాల సభ్యులు, తదితరులున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం



విద్యుత్ లైన్‌లను అనుసంధానం చేస్తున్న నిజామాబాద్ టెక్నికల్ డీఈ రమేశ్

బోధన్‌రూరల్ : వేసవికాలంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యమని నిజామాబాద్ ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ రమేష్, బోధన్ ఏడీఈ నగేష్ కుమార్ అన్నారు. బుధవారం సాలూర, బోధన్ టౌన్ -2 సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలాల్లో 'పొలం బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఈ రమేశ్, ఏడీఈ నగేష్ కుమార్ లు రైతులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులకు విద్యుత్ సంబంధిత సమస్యలు ఉంటే సిబ్బందితో పనులు చేయించుకోవాలన్నారు. సమస్యలు ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు కల్యాణ్, అధికారులు బాల కిషన్, శివరాజ్, ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవలు వినియోగించుకోవాలి



అంతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బాల్కొండ: గ్రంథాలయ సేవలను పాఠకులు వినియోగించుకోవాలని గ్రంథాలయ జిల్లా చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి అన్నారు. బుధవారం బాల్కొండ శాఖ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఉన్న వసతుల వివరాలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో పలు దినపత్రికలను పరిశీలించారు. అనంతరం ఆయనను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, నాయకులు కుందారపు శ్రీనివాస్, విక్కీ, యూనిస్, అన్వర్ పాల్గొన్నారు.

రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని గోన్‌గొప్పులకు చెందిన రైతులు స్థానిక ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఫర్టిలైజర్ యజమానులు రైతులకు ఇచ్చిన విత్తనాలు సమయం మించిపోతున్నా మొలక రావడం లేదన్నారు. 130 రోజుల్లో రావాల్సిన మొలక సమయం మించి పోయినా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించిన ఫర్టిలైజర్ దుకాణదారులపై, కంపెనీలపై కేసు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

ప్రింటర్ అందజేత



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1990–91 పదో తరగతి పూర్వ విద్యార్థులు ప్రింటర్‌ను అందజేశారు. రూ. 17,500 విలువ చేసే హెచ్‌పీ ప్రింటర్, స్కానర్, జిరాక్స్ మెషీన్‌ను పాఠశాల హెచ్‌ఎం మంజులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.చిన్నారెడ్డి, సంతోష్, నాగరాజ్, శ్రీనివాస్, సాయిభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్ : ప్రభుత్వం అందిస్తున్న రాయితీతో కూడిన ఎల్‌ఆర్‌ఎస్‌ను పథకాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల మహిళ సంఘంలో బుధవారం ఎల్‌ఆర్‌ఎస్ మేళాను నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..మున్సిపాలిటీలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కింద మొత్తం 4125 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 3065 మందికి ఫీజు ఇంటిమేషన్ లెటర్ పంపించామన్నారు. బుధవారం 21 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా, వారికి సుమారు రూ. 1.5 లక్షల రూపాయలు రిబేట్ (25%) కింద లబ్ధి చేకూరిందన్నారు. మొత్తంగా ఇప్పటివరకు 201 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా, మున్సిపాలిటీకి రూ. 96 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అలాగే గురువారం మామిడిపల్లిలోని ముదిరాజ్‌సంఘంలో ఎల్‌ఆర్‌ఎస్ మేళా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈకార్యాక్రమంలో మున్సిపల్ టీపీవో అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై కార్యదర్శులతో సమీక్ష

బాల్కొండ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎల్‌ఆర్‌ఎస్‌పై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతు.. ఎల్‌ఆర్‌ఎస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై 25 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీవో గంగామోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటలక్ష్మి

రెంజల్(బోధన్): పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని వక్తలు సూచించారు. మండలంలోని దూపల్లి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో అంజనేయులు, హెచ్‌ఎం వెంకటలక్ష్మి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాబన్నలు మాట్లాడుతు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. పరీక్షల సమయంలో భయాందోళన చెందవద్దని, ప్రశాంతమైన ఆలోచనతో సిద్ధమవ్వాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మీప్రియ, మాజీ ఎంపీటీసీ లింగంయాదవ్, మీ కోసం మేము స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు కృష్ణ, ప్రభాకర్, సాయన్న, రాజేశ్వర్, రాములు, రాధ తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో విద్యార్థుల స్వయం పాలన



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ ప్రైమరీ స్కూలులో విద్యార్థులు బుధవారం స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.ఈసందర్భంగా విద్యార్థులను టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేష్, టీచర్లు శ్రీనివాస్, రాధ, ఓంకార్, సోని, కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రకృతి బాగుంది

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రకృతిని చూసి అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ సాకేత్ కుమార్ పరవశించారు. ఇక్కడ ఏకో టూరిజం ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. బుధవారం డొంకేశ్వర్ మండలంలోని చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్ స్వాగతం పలికి వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలను చూపెట్టారు. ప్రతి వేసవిలో నీరు వెనక్కి తగ్గిన సమయంలో పచ్చికబయళ్లు ఏర్పడుతాయని దీంతో ఇక్కడ జింకలు, వలస పక్షుల సందడి నెలకొంటుందని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ ప్రాంతాన్ని అటవీ శాఖ పర్యవేక్షిస్తుందని తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1: రాక్షస(తెలుగు)-1.45; సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-4.20. 10.10; నారి(ది ఉమెన్)(తెలుగు)-7.35
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(తెలుగు)-10.15. సివంగి(తెలుగు)-1.30. రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-4.10. 7.20. 10.30
- స్క్రీన్-3- ఛావా(తెలుగు)-10.00. 4.20. కింగ్స్టన్(తెలుగు)-1.20.7.40. 10.40
- స్క్రీన్-4: ఛావా(తెలుగు)-12.20. 7.00. ఛావా(హిందీ)-3.40. 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: ఛావా(తెలుగు)- 11.00.4.40.10.30; ఛావా(హిందీ) - 1.45. 7.40
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు) -1.30. 7.30; నారి (తెలుగు) -4.40; రా.. రాజా(తెలుగు) -10.30
- స్క్రీన్-3: జిగేల్(తెలుగు) - 11.00; కింగ్స్టన్(తెలుగు)- 1.30. 7.30; రిటర్న్ ఆఫ్ డ్రాగన్(తెలుగు) -4.40. 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: ఛావా(తెలుగు)-10.00; కింగ్స్టన్(తెలుగు)-1.20. 7.40; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)- 4.20. 10.40
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-10.15; ఛావా(హిందీ)-1.30. 10.50; సివంగి(తెలుగు)-4.50; ఛావా(తెలుగు)-7.30
- స్క్రీన్-3: రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.25; ఛావా(తెలుగు)-1.35; మిక్కీ-17(ఇంగ్లీష్)-4.55. 7.50; కింగ్స్టన్(తెలుగు)-10.45
- స్క్రీన్ -4: నారి(తెలుగు)-10.35; మిక్కీ-17(ఇంగ్లీష్)-1.10. జాబిలమ్మ నీకు అంత కోపమా (తెలుగు)-1.30; సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-4.05. 10.30; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20

- లలితామహల్: సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు
- దేవి: మజాకా(తెలుగు)
- నటరాజ్: రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్
- విజయ్: ఛావా (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	140
	(కిలోకు)	లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,300	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	81,492		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

పసుపు పరిశోధన కేంద్రం సందర్శన

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రాన్ని మహారాష్ట్రలోని హింగోళి జిల్లా రైతులు బుధవారం సందర్శించారు. ఆరు ఎఫ్‌పీవో గ్రూపులు రాగా వారికి కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ తెలంగాణాలోని సాగు పద్ధతులను, ఎరువులు యాజమాన్యం, సస్యరక్షణ, నూతన యాంత్రీకరణ పద్ధతుల అంశాలపై అవగాహన కల్పించారు. ఎఫ్‌పీవోలు ఎలాంటి ప్రయోజనాలు పొందవచ్చో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పసుపు పంట, విత్తనాలను పరిశీలించారు. మహారాష్ట్ర రైతులు నూతన వ్యవసాయ పనిముట్లను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.

దాతల చేయూత అభినందనీయం

బోధన్‌రూరల్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు చేయూతనందించడం అభినందనీయమని సాలూర ఎంఈవో మంజూష అన్నారు. బుధవారం సాలూరలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ఆదర్శ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి (పెన్నులు, పెన్సిల్‌లు, ఫైల్స్) లను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ అధ్యక్షులు పావులూరి వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులున్నారు.

పెన్నులు, ప్యాడ్‌ల పంపిణీ

నవీపేట : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 450 మంది విద్యార్థులకు జనవికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో పెన్నులు, ప్యాడ్‌లను అందజేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన హెచ్‌ఎం రత్నకుమారి పదవీ విరమణ కార్యక్రమంలో డీఈవో అశోక్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. జనవికాస్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

పెరిక సంఘం నాయకులపై ఫిర్యాదు

వర్ని: మండలంలోని తగిలేపల్లిలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు స్థానిక పెరిక సంఘం నాయకులు అడ్డుపడడాన్ని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సాయిలుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంటే పెరిక సంఘం నాయకులు అకారణంగా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఆరోపించారు.

వీఆర్‌ఏల అరెస్టు

మాక్లూర్: వారసత్వ ఉద్యోగం ఇవ్వాలనే డిమాండ్‌పై బుధవారం చలో గాంధీభవన్ కార్యక్రమానికి వెళ్తున్న ఆయా గ్రామాల వీఆర్‌ఏలను పోలీసులు అరెస్టు చేశారు. సాయంత్రం 4 గంటలకు వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయినవారిలో వీఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు ఆసది భాస్కర్, ప్రధాన కార్యదర్శి ముత్యం, కమలాకర్, నీరడి సాయన్న, వీఆర్‌ఏలు ఉన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బహిరంగ వేలం

ఎడపల్లి(బోధన్): జానకంపేట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మార్చి 29న అమావాస్యను పురస్కరించుకొని బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, నవధాన్యాలు అమ్ముకోవడానికి గాను నిజామాబాద్‌కు చెందిన జి.నితిన్ రూ.44,000, లడ్డు పులిహోర అమ్ముకొనుటకు గాను జి.సురేష్ రూ.42,500, సైకిల్ స్టాండ్ పార్కింగ్ కోసం జానకంపేటకు చెందిన మనోజ్ కుమార్ రూ.5,100 బహిరంగ వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ దేవదాయ ధర్మాదాయశాఖ పరిశీలకులు బి.కమల, ఆలయ కార్యనిర్వహణ అధికారి గింజుపల్లి వేణు, డిపాజిట్‌దారులు పాల్గొన్నారు.

హరియాన్వి భాషను నేర్చుకోవాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): విద్యార్థులు హర్యానా రాష్ట్రానికి చెందిన హరియాన్వి భాషను నేర్చుకోవాలని హెచ్‌ఎం సురేశ్ కుమార్ సూచించారు. బుధవారం డొంకేశ్వర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఈభాషపై సంభాషణలు, చిత్రలేఖనం, నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు గంగాధర్, మహేశ్, తదితరులున్నారు.